
# సమ్వాదమే దాంపత్యం

డా॥ పులిగిళ్ళ నర్సింగ్‌రావు



భవానీ గురించి విన్నాక సుమికి భవానీమీద కోపం చిర్రెత్తుకొచ్చింది. అసలు దీనికేమైంది? ఇంతటి తెలివిలేని పని ఇదేలా చేసింది? ఇది మతి ఉండే ఇంత పని చేసిందా? సుమిలో ప్రశ్నల వర్షం మొదలైంది. పది నిముషాల క్రితం సుమి తండ్రి ద్వారా భవానీ గురించి తెల్సుకుంది. తండ్రి చెప్పిన మాటలు వింటుంటే భవానీ మీద సుమికి టన్నుల కొద్దీ కోపం ముంచుకొచ్చింది. తన మనస్సు మాత్రము నమ్మలేకపోతుంది. కాని, తన తండ్రి తనకు అబద్ధం చెప్పాల్సిన అవసరం ఉండదు కనుక నమ్మక తప్పడం లేదు. భవానీ, సుమిలు చిన్నప్పటి నుండి ఒకే మంచం, ఒకే కంచం అన్నట్లుగా పెరిగారు. క్లాస్‌మేట్స్ మాత్రమే కాదు, ప్రాణ స్నేహితులు కూడా. భవానీ గురించి సుమికు పూర్తిగా తెల్సు. భవానీ, సుమిలు ఇద్దరు ఒకేసారి ఎమ్.ఏ. పూర్తి చేశారు. ఎమ్.ఏ. పూర్తికాగానే మంచి సంబంధం రావడంతో సుమి తండ్రి సుమికి పెళ్ళి చేసేశాడు. సుమి ఉన్న కుటుంబానికి చెందిన అమ్మాయి. అందుకే ఆమె తండ్రి మంచి ఆస్థిపాస్తులు కలిగి తల్లిదండ్రులకు ఒకే కొడుకు ఉన్న సంబంధాన్ని వెతికి మరీ పెళ్ళి చేశాడు. డబ్బున్న కుటుంబంలో ఇస్తే మళ్ళీ వెనక్కి తిరిగి చూడాల్సిన అవసరం కూతురుకు రాదని సుమి తండ్రి నమ్మకం.

భవానీకి కాలేజీలో మంచి తెలివి తేటలు కలిగి ఉన్న అమ్మాయిగా పేరుంది. భవానీకి బంగారు భవిష్యత్తు ఉందని కూడా లెక్చరర్లు ఎప్పుడూ ప్రశంసిస్తుండేవారు. అలాంటి భవానీ నేడు పదో తరగతిలో పల్టీ కొట్టి మట్టి పిసుక్కుంటూ బతికేవాడ్ని పెళ్ళి చేసుకుందంటే నమ్మలేకపోతోంది సుమి. అసలు దానికేం ఖర్మ, మట్టి పిసుక్కుంటూ బతికేవాడ్ని పెళ్ళి చేసుకోవలసిన అవసరం ఏమొచ్చింది. దానికేం తక్కువ అని ఇంతపని చేసింది. మంచి చదువు ఉంది, అందం ఉంది. తింటే అరగని ఆస్తిపాస్తులున్నాయి. తల్లిదండ్రులకు ఏకైక కూతురు. ముగ్గురన్నల ముద్దుల చెల్లెలు. అన్నయ్యలు కూడా మంచి హోదాలో స్థిరపడ్డవారే. భవానీ తల్చుకుంటే మంచి హోదా కల్గిన ఉద్యోగమే వచ్చేది. అప్పుడు మంచి హోదా కల్గిన వ్యక్తే వరుడుగా లభించేవాడు. కారులో తిప్పే వాడు, ఏసి గదుల్లో సుఖాన్నిచ్చేవాడు లభించేవాడు. ఇంతటి బంగారు భవిష్యత్తును పెట్టుకుని బండ భవిష్యత్తును ఎందుకు ఎన్నుకుంది. అందులో అమ్మానాన్నలు బలవంతంగా ఈ పెళ్ళి చేశారంటే 'పాపం' అనవచ్చు. కాని, అమ్మనాన్నల్నే ఎదిరించి ముష్టి సంబంధాన్ని ఏం చూసి కోరుకుంది. సుమి మనస్సు మనస్సులో లేదు. ఆమెలో ప్రశ్నలు సముద్రపు కెరటాల్లా ఎగసి పడుతున్నాయి. వీలైనంత తొందరగా భవానీని కలుసుకుని ఓ సారి దుమ్ము దులపాలని గట్టిగా నిర్ణయించుకున్నాక ఆమె మనస్సు కొంతవరకు స్థిమితపడింది.

నెలరోజుల తర్వాత సుమి అనుకోకుండా భవానీ వాళ్ళ ఊరెళ్ళింది. చెప్పాపెట్టకుండా వచ్చిన సుమిని చూసి ఆశ్చర్యపోయింది భవానీ. అంతలోనే తేరుకొని గట్టిగా కౌగిలించుకుంది. ఒకరినొకరు చూసుకోక ఏడాది కావడంతో వాళ్ళ ఇద్దరి మధ్య ప్రేమాభిమానాలు క్రితం కన్నా రెట్టింపు అయ్యాయి. భవానీ సుమికు ఆనందంగా స్వాగతం పలికింది. భవానీకి ఇప్పుడు ఆనందంగా ఉంది. సుమికు మాత్రము పెంకుటింట్లో కూర్చోవాలంటే మహా కంపరంగా ఉంది. ముళ్ళమీద కూర్చున్నట్లు ఉంది. కొద్ది నిముషాలు సుమి ఒక్కతే కూర్చుంది. టీ తీసుకురావడానికి భవానీ లోపలికి వెళ్ళింది. సుమికు ఎదురుగా గోడకు ఫ్రేమ్ కట్టిన ఫోటో ఒకటి కన్పించింది. ఆ ఫోటోలో భవానీ ఉంది. పక్కన మరో యువకుడు ఉన్నాడు. ఎప్పుడూ చూసినట్టు అన్పించలేదు. కాని భవానీ భర్త అని పోల్చుకోవడానికి సుమికి ఎక్కువ సమయం పట్టలేదు. పెద్ద అందగాడు కూడా కాదు. ఏం చూసి చేసుకుందో అనుకుంది సుమి మనస్సులో. అంతలోనే భవానీ 'టీ' తీసుకొని వచ్చింది. టీ త్రాగుతూ ఒకరి క్షేమ సమాచారాలు ఒకరు అడిగి తెలుసుకున్నాక అసలు చర్చ ప్రారంభమయింది. ముందుగా సుమినే కదిపింది.

అసలు మీ ఆయన్ని నీవు ఏం చూసి చేసుకున్నావే? అతనిలో నీకు నచ్చింది ఏమిటి?

నీవు అనుకుంటే మంచి అర్హత కలిగిన వారు ఎందరో నీకోసం క్యూ కట్టేవారు. ఈ మట్టి పిసుక్కుని బతికే మనిషిని చేసుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది. అసలు ఈ పిచ్చిపని నీవెలా చేశావే? భవానీమీద ప్రశ్నలతో దాడికి దిగింది సుమి. ఈ హఠాత్ పరిణామానికి భవానీ ఉలిక్కిపడింది. ఈ విషయంలో అందరు తనను వ్యతిరేకించినా సుమి మాత్రము సమర్థిస్తుందని ఎన్నో ఆశలు పెట్టుకుంది. తన ఆశల్ని అడియాశలు చేస్తూ ప్రశ్నలతో దాడికి దిగేసరికి కొంత ఆందోళనకు గురైనా, వెంటనే తేరుకుని, నీకు తెలియదు సుమి అతను చాలామంచివాడు. శత్రువునైనా ప్రేమించగల గొప్ప వ్యక్తిత్వము, అతని సొంతం. అందుకే అతన్ని ఇష్టపడి మరీ చేసుకున్నాను అంది భవానీ. సుమికి భవానీ చెప్పిన సమాధానం నచ్చలేదు. నీవు ఎనైనా చెప్పు భవానీ, అతన్ని పెళ్ళి చేసుకుని నీవు పెద్ద తప్పే చేశావు. నీవు అనుకుంటే ఏ అందగాడో, ఏ కోటీశ్వరుడో, మంచి హోదాలో స్థిరపడ్డ ఏ ఉద్యోగస్తుడో ఏరికోరి చేసుకునేవాడు. అలాంటిది ఆఫ్టరాల్ ఒక వ్యవసాయదారుని చేసుకోవడం నాకు అసలు నచ్చలేదు. అసలు వినడానికే అసహ్యంగా ఉంది. అంటూ మూతి మూడువంకర్లు తిప్పింది సుమి. సుమి మాటలు వింటుంటే భవానీకి చిర్రెత్తుకొచ్చింది. చూడు సుమీ, నీవు డబ్బు, అందం, ఉద్యోగం, అంటూ కేవలం పైపై ఆకర్షణల గురించి మాట్లాడుతున్నావు. కాని, నేను అతని వ్యక్తిత్వం గురించి, అతని మనస్సు గురించి మాట్లాడుతున్నాను. ఎన్ని అర్హతలు ఉన్నా, ఎదుటి వ్యక్తిని సహృదయంతో ప్రేమించనివాడు అన్నీ ఉండికూడా, ఏమీ లేనివాడితో సమానం. డబ్బు, అందం, హోదా అంటూ మిడిసి పడుతున్నావు కదా? నేను అడిగే కొన్ని ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పు అంటూ సుమీవైపు చూసింది భవానీ.

హ్యాండ్‌సమ్‌గా ఎంతో అందంగా ఉండేవాడు తనకు భర్తగా కావాలని ఎన్నో మంచి సంబంధాల్ని వదులుకొని రాజేష్‌ని ఏరికోరి చేసుకుంది మన క్లాస్‌మేట్ వాసంతి. అది సుఖంగా సంసారం చేస్తోందా? అమ్మాయిల మోజులో పడి తనను పట్టించుకోవడం లేదని ఏదో మొక్కుబడిగా తప్పనిసరి పరిస్థితిల్లో తనతో సంసారం చేస్తున్నాడని ఏడాది నుంచి అమ్మానాన్నల దగ్గరే ఉంటోంది.

మంచి హోదాలో ఉద్యోగం ఉన్న వ్యక్తినే పెళ్ళి చేసుకుంటానని శపథం చేసిన లక్ష్మి, ఇంజనీర్‌ని చేసుకుంది. దాని వివాహం కూడా మూన్నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. పెళ్ళికి ముందే అతడు మందుకు బానిస. ప్రతిరాత్రి ఇష్టమొచ్చినట్టు త్రాగడం, ఏ రాత్రికో ఇంటికి రావడం, ఎందుకు త్రాగుతున్నారని అడిగినందుకు లక్ష్మిని చితకబాదడం అతని దినచర్యలో భాగమైంది. చివరకు అతడు తనను నిలదీస్తున్నందుకు లక్ష్మిని వదులుకోవడానికే సిద్ధపడ్డాడు. కానీ, మందును మాత్రం వదులుకోలేకపోయాడు.

అంతెందుకు నీ విషయమే తీసుకో. కోట్లకు పడగలెత్తిన వాడిని భర్తగా పొందాలని ఆశించావు. నీతో మీ నాన్నగారు కూడా శృతి కలిపారు. ఊహించినట్టే కోట్లకు పడగలెత్తిన వ్యక్తిని పెళ్ళి చేసుకున్నావు. నీ గుండెమీద చెయ్యివేసుకుని, నీ మనస్పూర్తిగా చెప్పు, నీ భర్తతో నీవు సంతోషంగా ఉన్నావా? డబ్బు సంపాదనలో పడి అసలు పట్టించుకోవడమే లేదని, బిజినెస్ టూర్లలో పడి ఎక్కువ రాత్రులు బయటే గడుపుతున్నాడని, నీవు నాకు ఎన్నిసార్లు చెప్పుకుని బాధపడలేదు. నా భర్త మట్టి పిసుక్కుని బతుకుతాడు నిజమే, కాదనను. కానీ, నా భర్త మట్టి పిసికితేనే నీవైనా నేనైనా ఇంత అన్నం తినగలుగుతున్నాము. అది గుర్తుంచుకో అంది భవానీ రోషంగా.

చెప్పడం ఆపి సుమివైపు చూసింది భవానీ. ఇప్పటికైనా నా మాటల్లోని నిజాల్ని ఒప్పుకుంటావా అన్నట్లుగా.

సుమికు భవానీ మాటలు రుచించలేదు. నీ పాట్లేవో నీవు పడు. నా పాట్లేవో నేను పడ్తాను. అన్నట్లుగా లేచి బయటపడింది. మనసంతా చేదుగా తయారయింది.

నెలరోజుల తర్వాత భవానీకి జ్వరం వచ్చి వారం రోజులైనా తగ్గలేదు. ఈ విషయం సుమికు తెల్సింది. వెళ్ళాలా వద్దా అని ఆలోచనలో పడింది. అలా ఆలోచిస్తుండగానే సుమి కాళ్ళు భవానీ ఇంటివైపు పరుగులు తీశాయి.

గుమ్మం వరకు వెళ్ళిన సుమి భయంభయంతో లోపలికి తొంగి చూసింది. అంతే ఆశ్చర్యపోయింది. భవానీ ఆమె భర్త తొడలమీద తలపెట్టి పడుకుంది. ఆమె భర్త మజ్జిగ కలిపిన అన్నం ముద్దలు ముద్దలుగా భవానీకి తినిపిస్తున్నాడు. ప్రేమామృతాన్ని కలిపి తినిపిస్తున్న అన్నం ముద్దల్ని పసిపిల్లలా తింటోంది భవానీ. ఆ దృశ్యం ఎంతో బావుంది. ఆ ఒక్క దృశ్యమే చాటుతోంది వాళ్ళ అన్యోన్యతని. అది చూడగానే సుమికి తన జీవితంలో ఎదురైన సంఘటన ఒక్కొక్కటి కళ్ళముందు కదలాడింది.

అప్పటికే సుమికు జ్వరం వచ్చి వారం రోజులవుతుంది. నీరసంగా ఉంటుంది. తప్పని సరి పరిస్థితుల్లో లేచి భర్తకు వంటచేసి పెడ్తుంది. ఒక్కరోజు కూడా ఏంటి అలా ఉన్నావు? జ్వరం కాని వచ్చిందా? అని అడగలేదు. ఓపిక నశించి ఓరోజు తనే చెప్పింది. జేబులోంచి ఓ వంద రూపాయలు నోటు తీసి సుమి పైకి విసిరి ఏదైన హాస్పిటల్‌కి వెళ్ళి చూపించుకోమని చెప్పి వెళ్ళిపోయాడు. మరో మూడు రోజులైనా సుమి హాస్పిటల్‌కు వెళ్ళలేదు, చూపించుకోలేదు. రోజురోజుకి ఆరోగ్యం క్షీణిస్తున్నా ఏరోజు కూడా ఆమె భర్త హాస్పిటల్‌కి వెళ్ళావా? చూపించుకున్నావా? ఎలా ఉన్నది? అని అడిగిన గుర్తులు లేవు. రోజురోజుకు ఆరోగ్యం క్షీణిస్తుండడంతో పక్కింటి వాళ్ళ సహకారము తీసుకొని హాస్పిటల్‌కి వెళ్ళింది.

తనకు భర్త అనేవాడు ఉండికూడా హాస్పిటల్‌కి వెళ్ళడానికి పక్కింటి వాళ్ళ సహకారము తీసుకోవాల్సి వచ్చింది. కాని, భవానీ భర్త అలాకాదు. అన్నిరకాల సహాయం అందిస్తున్నాడు. కార్లు, బంగ్లాలు ఉన్నా తమ కాపురం భవానీ ప్రేమాభిమానాల ముందు ఎంత దిగదుడుపో ఇప్పుడు అర్థమవుతోంది. భవానీ చెప్పిన మాటల్లోని నిజం ఏమిటో ఇప్పుడర్థమవుతోంది. పెళ్ళికొడుకు గుణగణాలలో అందం, డబ్బు, హోదా ఏవీ కూడా పెళ్ళికొడుకు అసలు రూపాన్ని తెలియచెప్పవని భవానీ నిరూపించింది. ఒకరినొకరు అర్థం చేసుకోవాలి, సహృదయంతో ఉన్నప్పుడే ఆ దాంపత్యం పది కాలాలు వర్ధిల్లుతుందని భవానీ నిరూపించింది. మేడిపండులా ఉన్న భర్తల్ని చూసి సుమీనే కాదు లక్ష్మీ, వాసంతీలు సంబరపడిపోయారు. కాని లోపల పురుగులున్నాయని ఆలస్యంగా తెలుసుకున్నారు. ఈసారి సుమి కళ్ళల్లోంచి రెండు ఆనందభాష్పాలు రాలి పాదాల మీద పడ్డాయి. మనస్సులోనే అనుకుంది. 'భవానీ యు సెలక్టెడ్ ఏ గ్రేట్ పర్సన్!' ❋

## గమనిస్తున్నా!



ఒకప్పుడు రాణీని బ్రహ్మాండంగా ప్రమోట్ చేసిన గోవిందా ఇపుడు ఐశ్వర్యమీద, రంభ మీద, కొత్తమ్మాయి కరీనా మీద చూపిస్తున్నాడు. గోవిందాకి బాగు తెలుసు ఎపుడు ఎవర్ని ఎంతగా ఉపయోగించుకోవాలో. అయితే రాణీ మాత్రం బయటపడకుండా అంతా గమనిస్తోంది. అయితే మాత్రం నష్టం ఎవరికి?